# పిడికెడు గుండె

ప్రాక్టీస్ పెట్టి నెలరోజులైనా ఒక్క పేషంటూ రాలేదు. ఏమీ తోచక మెడికల్ జర్నల్స్ చదువుకుంటూ కూచున్నాను.

ఒకప్పుడు వూరికో డాక్టరుండటం గగనంలా ఉండేది. ఇపుడు వీధికిద్దరున్నారు. అయినా ఎంసెట్‌ల కోసం మనుషులు ఎగబడ్తూనే ఉంటారు. డాక్టర్ కోర్సు కోసం లక్షలు ఖర్చు చేస్తూనే ఉంటారు.

నేను ఉత్సుకత కొద్దీ డాక్టర్ కాలేదు. చాలా మందికిమల్లే మా తల్లిదండ్రుల అహం కోసం, సొసైటీలో దొరికే హోదా కోసం – తద్వారా వచ్చే కట్నం డబ్బులకోసం . . . అంతే!

ప్రాక్టీస్ పెట్టడం కోసం ఈ రెండుగదుల రూమ్‌ని అద్దెకు తీసుకున్నాను. ఓ గదిలో పేషంట్స్ కూచోడానికి కుర్చీలు ఏర్పాటు చేశాను. ఓ చిన్న టేబుల్‌మీద రకరకాల పత్రికలు పెట్టించాను. రూంని శుభ్రపర్చడానికీ, పేషంట్స్‌ని లోపలికి పంపటానికి నెలజీతం మీద ఓ కుర్రాడిని కుదుర్చుకున్నాను. ఇక స్టెతస్కోపూ . . . పరీక్ష చేయటానికి ఓ బల్లా . . . వెయింగ్ మిషనూ . . . బీపీ ఆపరేటస్ . . . నాకో కోటూ . . . దానికో టై . . . అంతా హంగామా. నెలకు రెండుమూడు వేల ఖర్చు తప్ప పైసా ఆదాయం కన్పించటం లేదు.

"డాక్టరు బాబున్నారా?" బైట ఎవరిదో గొంతు విన్పించింది.

"ఉన్నారు, లోపలికెళ్ళండి" అంటున్నాడు పని కుర్రాడు.

వాడి స్వరంలోని కుతూహలం నేను గమనించకపోలేదు.

నా మొదటి పేషంట్‌ని దండవేసి సత్కరించటం సాధ్యంకాదు కాబట్టి దరహాసంతో పల్కరించి కూచోమన్నాను.

అతనికి వయసు అరవై పైనే ఉంటుంది. జుట్టు తెల్లగా నెరిసి, అక్కడక్కడా నల్లటి వెంట్రుకలు బెరుగ్గా కన్పిస్తున్నాయి.

మొహంలో ఉదాసీనత . . . దేన్నో ఎక్కడో పోగొట్టుకుని దానికోసం అనవరతం, అడుగడుక్కీ వెతుక్కుంటున్నట్లు . . . అతనిలో ఆందోళన.

మనిషి బాగా చదువుకున్నవాడిలానే ఉన్నాడు. ఖరీదయిన బట్టలు వేసుకుని ఉన్నాడు. డాక్టరుగా అతని ఆర్థికస్థాయిని అంచనా వేసుకున్నాక "చెప్పండి" అన్నాను.

"కొన్ని రోజుల నుండీ గుండెల్లో నొప్పిగా ఉంటోంది బాబూ. అస్థిమితంగా . . . వూపిరాడనట్లు . . . ఉక్కిరిబిక్కిరిగా అయిపోతున్నట్లు . . . "

ప్రిస్క్రిప్షన్ ప్యాడ్ తీసుకుని దానిమీద తారీఖు వేశాక –

"మీ పేరు?" అడిగాను.

"ప్రసాదరావు"

"వయసు?"

"అరవై రెండు"

అతను చెప్పిన కంప్లైంట్ రాశాక "ఇంకా . . ." అని అడిగాను.

"నీరసంగా ఉంటోంది బాబూ . . . ఏ పనీ చేయాలనిపించదు. ఉత్సాహమే ఉండదు. నేను ఉద్యోగం చేసే రోజుల్లో నన్నందరూ బుల్ వర్కర్ అనేవారు. పనంటే అంత ఆసక్తి. కానీ ఈ మధ్య . . . "

"ఏం ఉద్యోగం చేసేవారూ?"

"సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా చేసి రిటైరయ్యాను"

బీ.పి. చెక్ చేద్దామని ఆపరేటస్ తీశాను.

"నాకు బీ.పి. లేదు. షుగరూ లేదు. దృఢమైన శరీరం . . . ఈ మధ్యనే గుండె . . . బలహీనపడినట్లనిపిస్తోంది"

అతను చెప్పేది వింటూనే బీపి చూశాను. ఆ వయసుకు తగ్గట్లు నార్మల్‌గానే ఉంది.

స్టెత్ పెట్టి గుండె, వూపిరితిత్తులు పరీక్షించాను. అంతా సవ్యంగా ఉంది.

"మీ గుండె నిక్షేపంగా ఉంది. బహుశా గ్యాస్ట్రిక్ ప్రాబ్లం వల్ల గుండెల్లో అసౌకర్యంగా ఉందేమో. మందులు రాసిస్తాను. ఓ వారం వాడండి. అప్పటికీ తగ్గకపోతే ఇ.సి.జి. చేయిద్దాం. అనవసరంగా మొదలే టెస్టులెందుకు" అన్నాను.

"అచ్చం మా బాబులా అంటున్నావు. మా అబ్బాయి కూడా డాక్టరే. యం.డి. చదివాడు. వాడికీ అనవసరంగా టెస్టులు రాయడం ఇష్టం ఉండదు".

వాళ్ళబ్బాయి మా జాతివాడేనని తెలిసి కుతూహలం పెరిగింది.

"ఇప్పుడు ఎక్కడ ప్రాక్టీస్‌చేస్తున్నాడు?" అని అడిగాను. ఇతను నా దగ్గరకొచ్చాడంటే వాళ్ళబ్బాయి మరే వూళ్లోనో ఉండి ఉండాలన్న అభిప్రాయానికొచ్చి.

"వాడు అమెరికాలో ఉన్నాడు బాబూ. అక్కడ డాక్టర్‌గా వాడికి మంచి పేరుంది" గర్వంగా చెప్పాడతను. అలా అంటున్నప్పుడు అతని ఛాతీ అరంగుళం పెరగటం గమనించాను.

మందులు రాసిచ్చి ఓ వారం ఆగాక రమ్మని చెప్పాను.

రెండోరోజే మరలా కన్పిస్తే ఎలాగూ ఖాళీగానే ఉన్నాను కాబట్టి విసుగుపడకుండా "ఎలా ఉన్నారు? రండి. కూచోండి" అన్నాను మనస్ఫూర్తిగా.

అతను విశాలంగా నవ్వాడు.

మొహం తేటగా ఉంది. ఆరోగ్యంగా కన్పిస్తున్నాడు.

నా మందులు బాగా పనిచేసినట్లున్నాయి.

"ఇప్పుడు నెమ్మదించినట్లే ఉంది బాబూ . . . నొప్పి అలానే ఉన్నా గాభరా, గుండె దడా తగ్గాయి. నీ హస్తవాసి మంచిదిలా ఉంది. ప్రాణానికి హాయిగా ఉంది".

ఆ మాటలు వినగానే నా ఛాతి రెండంగుళాలు పెరగటం నాకు తెలుస్తూనే ఉంది.

"కూరగాయల్లో క్యాబేజీ, కాలీఫ్లవర్, చిక్కుడు వాడకండి. ఉల్లిపాయ వాడకం కూడా వీలైనంత తగ్గించండి. ఇవి గ్యాస్‌ని ప్రొడ్యూస్ చేస్తాయి. రాత్రుళ్ళు పెరుగు బదులు పల్చని మజ్జిగ వాడండి. ఈ వయసులో సులభంగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకోవడం మంచిది. నెక్స్ టైం వచ్చినపుడు మీ ఆవిణ్ణి పిల్చుకు రండి వివరంగా చెప్తాను" అన్నాను.

ఆ మాటలకు అతను అదోలా మొహం పెట్టాడు. నేనేదో తప్పు మాట్లాడానని నాకర్థమైంది.

"నా భార్య రెండేళ్ళ క్రితం చనిపోయింది బాబూ" అతని గొంతులో అంతులేనంత విషాదం . . .

"ఐయాం సారీ" నొచ్చుకుంటూ అన్నాను.

"ఆ రోజు ఉదయం మామూలుగానే లేచింది. నాకు టిఫిన్, కాఫీలు ఇచ్చాక పొయ్యిమీద చారు పడేసింది. చారు మరుగుతుండగా నా దగ్గరకొచ్చి 'ఒంట్లో ఎలాగో ఉంది. కొద్దిసేపు నడుం వాలుస్తాను. ఓ అయిదు నిమిషాలు మరిగాక చారు దించేయండి. నేనొచ్చి కూర వండుతాను' అంది. తనకు బీ.పి., షుగరూ రెండూ ఉన్నాయి. చారు దించాక అరగంట చూసినా తను రాకపోతే నిద్రపోయిందేమో లేపుదామని బెడ్రూంలోకెళ్ళా. మంచంమీద ప్రశాంతంగా నిద్రపోతున్నట్లే ఉంది బాబూ . . . గట్టిగా పిల్చినా లేవకపోతే తట్టి లేపబోయిన నాకు అర్థమైంది – నా జీవితంతో ముప్పయ్ ఆరేళ్ళుగా ముడిపడిన మరో జీవితం ముగిసిందని . . ."

అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

అతని మాటల్ని బట్టి భార్యాభర్తలిద్దరూ అన్యోన్యంగా ఉండేవారనిపించింది. ఆమె మరణం అతన్ని బాగా క్రుంగదీసి ఉంటుంది. ఆ షాక్ నుండి బయట పడటానికి అతనికి చాలా సమయం పట్టి ఉంటుంది. అసలిప్పటికీ బైటపడలేదేమో . . .

"మరి మీరెవరితో ఉంటారిక్కడ?"

"మాకు ఒక్కడే కొడుకు బాబూ – కిశోర్. వాడే అమెరికాలో ఉంది. నా భార్య పోయినప్పటినుండీ నేను ఒంటరిగానే ఉంటున్నాను. వంట చేయటంకోసం ఓ పనిపిల్లను పెట్టుకున్నాను".

"అవే మందులు కంటిన్యూ చేయండి" అన్నానతను వెళ్ళే ముందు.

మరో వారం తర్వాత వచ్చాడతను.

"గుండె నొప్పి తగ్గటంలేదు బాబూ" అంటూ మొదలెట్టాడు.

వయసు అరవై దాటిందాయె. ఎందుకయినా మంచిదని ఆలోచించి ఇ.సి.జి. చేయించుకోమని రాసిచ్చాను.

"రాత్రిళ్లు నిద్ర రావటం లేదు బాబూ . . . తెల్లగా తెల్లారే వరకూ నిద్రకోసం పోరాటం తప్ప విజయం వరించటం లేదు. అథవా కొద్దిగా కునుకుపట్టినా కలత నిద్రవుతుంది తప్ప కంటినిండా నిద్ర కరువే. నిద్ర పట్టడానికి ఏదైనా మందు రాసివ్వు" అన్నాడతను.

"ఈ వయసులో నిద్రకోసం మందులు వాడటం మంచిదికాదు. మనసు ప్రశాంతంగా ఉంచుకోండి. ధ్యానం చేయండి. నిద్ర అదే వస్తుంది" అన్నాను.

"ప్రశాంతత . . . ధ్యానం . . . హుఁ" తనలో తను గొణుక్కుంటున్నట్లుగా అని వెళ్ళిపోయాడు.

మరునాడు ఇ.సి.జి. రిపోర్ట్ పట్టుకుని వచ్చాడు. అంతా నార్మల్‌గా ఉంది.

"గుండెకు సంబంధించి మీకే రకమైన జబ్బూలేదు – మీ గుండె రాయిలా ఉంది" అన్నాను నవ్వుతూ.

ఆ మాటకు అదోలా చూశాడతను. నేను వాడిన ఉపమానం చేదుగా అన్పించినట్లుంది.

"రాయే అయితే నొప్పెందుకు వస్తుంది బాబూ . . . నువ్వు ఏమీ లేదంటున్నా, అనుభవిస్తున్న నాకు తెలుసు కదా. రెండు చివర్లూ పట్టుకుని గుడ్డను పిండినట్లు నా గుండెను పిండుతున్నంత బాధ . . . ప్రాణంపోయేంత బాధ నేననుభవిస్తుంటే. ఏం లేదంటావేమిటి?"

నేను కొద్దిసేపు ఆలోచించాను. శరీరంలో రుగ్మత ఉన్నట్లు ఆధారాలు దొరకటం లేదు కాబట్టి జబ్బు మానసికం అయ్యే అవకాశాలే ఎక్కువ.

మెదణ్ణి శాంతపరిచే మందులు కొన్నాళ్ళు వాడితే నయమవుతుందేమోననే ఆశతో ఆ మందులు రాసిచ్చి, "ఓ పదిరోజులు వాడి చూడండి. నొప్పి అప్పటికీ తగ్గకపోతే స్పెషలిస్ట్‌కి చూపిద్దాం" అన్నాను.

మెల్లమెల్లగా పేషంట్స్ రావడం ప్రారంభమైంది. రోజుకు కనీసం నలుగురైదుగురు వస్తున్నారు. ప్రాక్టీస్ పుంజుకుంటోంది.

అతను మరో నాలుగు రోజుల తర్వాత వచ్చాడు.

"నిద్రెలా పడ్తోంది" అని అడిగాను.

"పడ్లేదు" అని కొన్ని క్షణాలు ఆగి చెప్పాడతను. "ఉదయం నుండీ విపరీతమైన కడుపునొప్పి- అందుకొచ్చాను"

"గుండె నొప్పి ఎలా ఉంది?"

"స్థిరంగా ఉంది. ఏ రకమైన హెచ్చుతగ్గులూ లేవు".

భోజనంలో ఏయే పదార్థాలు తిన్నాడో కనుక్కుని కడుపునొప్పికి మందులు రాసిచ్చాను.

రెండ్రోజులు కావటం ఆలస్యం – మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

ఈసారి కాళ్ళు నొప్పులట – విపరీతంగా గుంజేస్తున్నాయట.

మందులు రాసిచ్చాను.

మరోసారి తలనొప్పి – ఇంకోసారి నడుం నొప్పి . . .

నాకతని అవస్థ అంతుబట్టటం లేదు.

నాకివ్వాల్సిన ఫీజు మాత్రం వద్దన్నా వినకుండా ఖచ్చితంగా ఇవ్వటం వల్లా . . . అతను నా మొదటి పేషంట్ అన్న సెంటిమెంట్ వల్లా . . . అతని వయసు దృష్ట్యా అతనెన్ని సార్లు వచ్చినా విసుక్కోకుండా – ఓపిగ్గా అతను చెప్పేదంతా విని – నాకు తోచిన మందులు రాస్తూనే ఉన్నాను. అయినా రెండుమూడు రోజులు కాకుండానే మళ్ళీ వచ్చేస్తున్నాడు.

ఈ నాలుగు నెలల కాలంలో దాదాపు నలభైసార్లు వచ్చి ఉంటాడు. వచ్చిన ప్రతీసారీ కనీసం పావుగంటైనా కూచుని, మొదట అనారోగ్యం గురించి చెప్తాడు. తర్వాత చనిపోయిన తన భార్య మంచితనం గురించీ, అమెరికాలోని తన కొడుకు గురించీ చెప్తాడు.

ఎన్ని రకాల రుగ్మతలు చెప్పినా వాటితో పాటు గుండెనొప్పి గురించి చెప్పటం మాత్రం మర్చిపోడు.

హైపోకాండ్రియాక్ ఏమోననే నిర్ధారణకు వస్తున్న తరుణంలో మా ఆఫీస్‌బాయ్ ఆసక్తికరమైన వార్తను మోసుకొచ్చాడు.

మొన్న ప్రసాదరావుగారికి మందులు రాసిచ్చాక, ఆఫీస్‌బాయ్‌ని పిలిచి థర్మామీటర్ కొనుక్కురమ్మని పంపించాను. అతను వెళ్తుంటే - ముందు ప్రసాదరావుగారు వెళ్తూ కన్పించారట. మెడికల్‌షాపు వచ్చినా మందులు కొనకుండా దాటిపోతుంటే మరో చోట కొనుక్కుంటారేమోననుకుని తను షాపులోకి వెళ్ళబోతూ ఆగి చూశాడట. ప్రసాదరావుగారు జేబులోంచి మందుల చీటీని తీసి నాలుగు ముక్కలుగా చింపి, రోడ్డు పక్కగా పడేసి ముందుకెళ్ళి పోయారట.

అది విన్నవెంటనే మొదట కోపం వచ్చింది. డాక్టర్ దగ్గరకు రావడం తమాషా అనుకుంటున్నాడా? నేను రాసిచ్చిన మందులమీద నమ్మకంలేక చించేస్తున్నాడా? ఈసారి వచ్చినపుడు నాలుగూ దులిపేద్దాం అనుకున్నాను.

తర్వాత ప్రశాంతంగా ఆలోచిస్తే డాక్టరుగా నేను చేయాల్సింది అది కాదనిపించింది. అతనలా ప్రవర్తించడం వెనుక కారణాలేమై ఉంటాయా అని ఆలోచించాను. అతను సరదాకో, తమాషాకో అలా చేస్తుంటే అంత ఖచ్చితంగా నా ఫీజు చెల్లించడు. అసలా మనిషి అలాంటి వాడు కాదు. మరేదో కారణం ఉండి ఉండాలి.

నాకీ విషయం తెల్సిన మూడోరోజు అతనొచ్చాడు. మొహం అంతా వేలాడేసుకుని- ఉదాసీనంగా - విచారంగా . . .

"ఎలా ఉన్నారు?" నవ్వుతూ అడిగాను.

"ఏం చెప్పమంటావు బాబూ . . . గుండెను ఎవరో ఇనుప పిడికిళ్ళతో పిసికేస్తున్నట్లు బాధ. నీ దగ్గరకు నాలుగైదు నెలలనుంచీ వస్తున్నా, కొద్దిగా కూడా తగ్గలేదు. దీనికి తోడు నిన్నటినుండీ వాంతులు . . . మొత్తం పేగుల్తో సహా బైటికొచ్చేస్తున్నట్లనిపిస్తోంది" అన్నాడతను.

"ఆకలి ఎలా ఉంది?"

"అస్సలు అన్నహితవు లేదు బాబూ . . . కొంచెం తిన్నా అరగటంలేదు."

అతన్ని పరీక్షించి, మందులు రాసిచ్చి "ఇవి వాడండి. తగ్గిపోతుంది" అంటూ "అమెరికా వెళ్ళి మీ అబ్బాయి దగ్గర నాల్రోజులు ఉండి రాకూడదూ. గాలి మార్పుగా ఉంటుంది" అన్నాను.

అతని మొహంలో రంగులు మారాయి. విషాదం అలుముకుంది.

"పిలవని పేరంటానికి పోయి అవమానింపబడటం కంటే ఉన్న వూర్లోనే ఉండటం నయం కదా బాబూ" అన్నాడు.

అతని కోడలు అతన్ని సరిగ్గా చూడదేమోననిపించింది. అందుకే ముసలాయన వెళ్ళడానికి ఇష్టపడటంలేదనుకున్నా.

"పోనీ మీ అబ్బాయినే వచ్చి మీతో కొన్ని రోజులు గడిపి వెళ్ళమనరాదూ"

అతను వేదాంతిలా విరక్తిగా నవ్వాడు.

"మనుషులు డాలర్ల సంపాదనలో పడ్డాక అనుబంధాలు గుర్తుంటాయా బాబూ . . . మన పిచ్చిగానీ . . . వాణ్ణి ప్రాణంలో ప్రాణంలా చూసుకుంది వాళ్ళమ్మ. వాడు చిన్నప్పుడు నడుస్తుంటే వాడి పాదాలు కందిపోతాయేమోనని తల్లడిల్లిన వాళ్ళమ్మ చనిపోయినపుడే తీరిక లేదని రాలేదు. తల్లీ దండ్రీ  పిల్లలూ . . . అంతా వట్టి భ్రమ".

అతను బయటకు వెళ్ళిన వెంటనే బాయ్‌ని పిలిచి అతను గమనించకుండా అతన్ని ఫాలో కమ్మని చెప్పాను.

పది నిముషాల్లో వాడు వగర్చుకుంటూ పరుగెత్తుకొచ్చి చెప్పాడు – మొన్నట్లానే మందుల చీటీని చింపేసి ముక్కలు చెత్తకుప్పలో పడేసి వెళ్ళిపోయాడని.

నాకు అతని జబ్బేమిటో పూర్తిగా అర్థమైపోయింది.

అతని రాకకోసం ఎదురుచూస్తూ రెండ్రోజులు గడిపాను. మూడో రోజు వచ్చాడు – మొహం దిగాలుగా పెట్టుకుని.

"ఇప్పుడెలా ఉంది ప్రాణం?" అతను కూచున్నాక అడిగాను.

"వాంతులాగిపోయాయి బాబూ. నేను ఏ కంప్లైంట్‌తో వచ్చినా నువ్విచ్చే మందుకి మరునాటికల్లా అది మాయం అనుకో. ఎటొచ్చీ నా గుండె నొప్పి మాత్రం తగ్గించలేకపోతున్నావు. ఈ నొప్పి భరించేకంటే చచ్చిపోతేనే బావుండుననిపిస్తోంది" అన్నాడు నిష్ఠూరంగా.

"మీ గుండెనొప్పికి అసలు కారణమేమిటో నాకర్థమైపోయింది" అన్నాను.

అతను కుతూహలంగా ముందుకు వంగి 'ఏవిటదీ' అన్నట్లు చూశాడు.

"ఆ జబ్బు పేరు ఇదీ" అంటూ ప్రిస్క్రిప్షన్ కాగితం మీద 'ఒంటరితనం' అని రాసిచ్చాను.

అది చదువుకుని అతను మరింత ఉదాసీనంగా అయిపోయాడు. మరో పదేళ్ళవయసు పైబడినట్లు కన్పించాడు.

"ఈ వీధికి చివర్లో ఓ క్రష్ ఉంది. అది నడుపుతున్నావిడ నాకు బాగా తెలుసు. నేనామెతో మాట్లాడతాను. మీరు ప్రతిరోజూ రెండు మూడు గంటలు అక్కడి పిల్లల్తో గడపండి. సాయంత్రాలు ఏదైనా ఓల్డ్‌ఏజ్ హోంకెళ్ళి కూచోండి. అక్కడి వ్యక్తుల్తో మాట్లాడండి. హైద్రాబాద్‌లో ఎన్ని సుందరప్రదేశాలు లేవూ? ఆహ్లాదకరంగా ఉండే స్థలంలో ఓ గంట కూచోండి. మీ గుండె నొప్పి దెబ్బకు మాయం" అన్నాను.

అతను సమాధానంగా ఏమీ చెప్పలేదు. శూన్యంలోకి చూస్తున్నట్లు చూపును అనంతంలో

పాతేసి - నిశ్శబ్దంగా ఓ నిముషం కూచున్నాడు. ఏదో గుర్తొచ్చిన వాడిలా లేచి 'ఒంటరితనం' అని నేను రాసిచ్చిన కాగితం పట్టుకుని వెళ్ళిపోయాడు.

వారం వరకూ రాలేదు.

ఇక రాడనుకున్నా.

కానీ రెండోవారం సగంలో వచ్చాడు.

మనిషి బాగా డీలాపడిపోయి ఉన్నాడు. నిజంగా జబ్బుచేసిన మనిషిలానే ఉన్నాడు. మొహం పీక్కుపోయి . . . కళ్లు లోతుకు పోయి . . .

"ఏం అలా ఉన్నారు? ఆరోగ్యం బాగోలేదా?" అని అడిగాను అతన్ని చూడగానే.

అతను రెండు మూడు రోజులకోసారి రావటం నాకు బాగా అలవాటై, అతనంటే ఓ రకమైన ఆత్మీయత ఏర్పడిందన్న నిజం నాకాక్షణమే అర్థమైంది.

"అంతా బాగానే ఉంది బాబూ . . . కానీ నా గుండె . . . మెలి పెట్టినట్లు . . . సూదుల్తో గుచ్చుతున్నట్లు . . . నువ్వు నమ్మటం లేదు . . . కానీ నిజం . . . భరించలేనంత బాధ . . . నాకు ఈ నరకం నుంచి విముక్తి ప్రసాదించు" అన్నాడు.

"నేను చెప్పిన చిట్కా పనిచేయలేదా?" అనుమానంగా అడిగాను. నా ప్రిస్క్రిప్షన్ కాగితాన్ని ముక్కలు చేసినట్లుగానే నా సలహాను కూడా చెత్తకుండీలోకి గిరాటేశాడేమోనని . . .

అతను కొన్ని క్షణాలు దీర్ఘంగా నావైపు చూసి చెప్పాడు.

"ఎంతమందితో మాట్లాడినా నా కొడుకుతో మాట్లాడిన తృప్తి దొరుకుతుందా బాబూ . . . వాడిమీద ఎంతటి ప్రేమ పెంచుకున్నాను ! ఎంతటి ఆపేక్ష గుండెనిండా నింపుకున్నాను! నా గుండెలో విపరీతమైన వత్తిడి వాడిమీద నాకున్న మమకారం బాబూ . . . సూదుల్తో గుచ్చినట్లు, స్క్రూడ్రైవర్లతో పొడిచినట్లు అన్పించే బాధ వాడి కఠినమైన ప్రవర్తనవల్ల బాబూ . . . ఇనుప పిడికిళ్ళతో నా గుండెను పిండేది నిర్దయుడైన నా కొడుకే . . .

నువ్వూ డాక్టరే - మావాడూ డాక్టరే. మీ ఇద్దరి వయసూ ఇంచుమించు ఒక్కటే. నీ నవ్వూ, మాటా మా వాడిని గుర్తుకు తెస్తాయి బాబూ . . .

అందుకే రెండుమూడు రోజులకోసారి నీతో మాట్లాడే ఈ కొన్ని నిమిషాలే నా గుండె నొప్పినుంచి కొద్దిగా ఉపశమనాన్ని కలిగిస్తాయి. అంతే . . .

ఈ నొప్పి శాశ్వతం బాబూ . . . ఇది తగ్గదు. నన్నిలా హింసిస్తూనే ఉంటుంది. దీనికి ఏ చిట్కాలూ, ఏ మందులూ పనిచేయవు" అంటూ అతను గొల్లుమని ఏడ్చేశాడు.

నాకాక్షణం అతన్ని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు.

నా గుండెనెవరో పిండుతున్నట్లు . . . బాధ.

*(విపుల, జులై 2001)*